క్లుప్తంగా

అన్నార్తుల ఆకలి తీర్చడంలో ఆనందం


అన్నార్తులకు ఆహార పొటాలు అందిస్తున్న కౌశిక్, శ్రావణి

విజయనగరం: అన్నార్తుల ఆకలి బాధ తీర్చడం లోనే నిజమైన ఆనందం ఉంటుందని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వర్ కౌశిక్, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అభిప్రాయ పడ్డారు. తమ వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక థెరిసా క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా సర్వజన ఆస్పత్రి ఆవరణలో రోగుల కుటుంబ సభ్యులు, పేదలకు ఆహార పదార్థాలను అందించారు. కార్యక్రమంలో థెరిసా క్లబ్ వ్యవస్థాపక కార్యదర్శి కురియాకోస్, పలువురు క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

వైభవంగా జగన్నాథస్వామి విగ్రహ ప్రతిష్ఠ

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సీతారామునిపేటలో గల శ్రీకృష్ణ గోపిక బృందావన ఆశ్రమంలో జగన్నాథ స్వామి విగ్రహ ప్రతిష్ఠ బుధవారం వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణ ప్రతిష్ఠ కార్యక్రమం జరిగింది. ఎంపీపీ అంబళ్ల సుధారాణి, సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సలహా మండలి సభ్యుడు అంబళ్ల శ్రీరాములనాయుడు, డీసీసీబీ వైస్ చైర్మన్ చనమల్లు వెంకటరమణ, టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ పతివాడ సత్యనారాయణ, తదితరులు స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు రాంబార్కి రామారావు, బూర్లి సత్యం, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు


మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రం

డెంకాడ: మండలంలోని పలు గ్రామాలతో పాటు మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంపీడీఓ స్వరూపారాణి బుధవారం ప్రారంభించారు. అలాగే గొలగాం, బంటుపల్లి గ్రామాల్లో కూడా చలివేంద్రాలు ఏర్పాటు చేశారు.

దాతలు సహకరిస్తే సేవలు విస్తృతం

విజయనగరం పూల్‌బాగ్: దాతలు సహకరిస్తే మరింత సేవలందించేందుకు తామెప్పుడూ సిద్ధంగా ఉన్నామని గురజాడ విజ్ఞాన కేంద్రం కన్వీనర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. గురజాడ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, శిక్షణ కేంద్రానికి అవసరం నిమిత్తం ధీర ఫౌండేషన్ అధినేత బొత్స సందీప్ ఎస్ఎఫ్ఐ ద్వారా విరాళం అందజేశారన్నారు. నిరుపేద విద్యార్థులను ఆదుకునేందుకు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు.

పౌష్టికాహారం తప్పనిసరి


గర్భిణులకు సీమంతం చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

విజయనగరం ఫోర్ట్: గర్భిణులు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి. అనురాధ అన్నారు. బొబ్బాదిపేట అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు బుధవారం సామూహిక సీమంతం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, క్రమంతప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు బి.సత్యవేణి, రత్నం, తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దు


అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ మధుకుమార్

విజయనగరం క్రైమ్: యువత మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ బి.మధుకుమార్ పిలుపునిచ్చారు. మహారాజా పాలిటెక్నికల్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆధ్వర్యంలో 'మాదకద్రవ్య రహిత ఆంధ్రప్రదేశ్' అనే అంశంపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మాదకద్రవ్యాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో డీటీఎఫ్ సీఐ ఎస్.రాజేశ్వరి, ఇంటిలిజెన్స్ సీఐ శేఖర్‌బాబు, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పట్టభద్ర ఓటర్లు పెరిగారు..

- నియోజకవర్గంలోని ఓటర్ల సంఖ్య 5527
- గత ఎన్నికలతో పోల్చితే దాదాపు రెట్టింపు
- ఎన్నికల నిర్వహణకు నాలుగు మండలాల్లో ఏడు పోలింగ్ కేంద్రాలు



నెల్లిమర్లలో గ్రాడ్యుయేట్ ఎన్నికల పోలింగ్ కేంద్రం

నెల్లిమర్ల: నియోజకవర్గంలో గ్రాడ్యుయేట్ (పట్టభద్రులు) ఓటర్ల సంఖ్య ఈ సారి గణనీయంగా పెరిగింది. 2017లో జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలతో పోల్చితే ఓటర్ల సంఖ్య దాదాపు రెట్టింపు అయింది. తాజా గణాంకాల ప్రకారం నెల్లిమర్ల నియోజకవర్గంలో 5527 మంది గ్రాడ్యుయేట్లు ఈ సారి తమ ఓటుహక్కును నమోదు చేసుకున్నారు. నెల్లిమర్ల నగర పంచాయతీ, మండలంలో అత్యధికంగా 2162 మంది గ్రాడ్యుయేట్లు ఓటు నమోదు చేసుకున్నారు. మార్చి 13న నిర్వహించే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం సంబంధిత అధికారులు ఓటర్ల సంఖ్య ఆధారంగా నియోజకవర్గంలో ఏడు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల సంఘం గతంలో ఉండే ఓటర్ల జాబితాను రద్దు చేసిన విషయం తెలిసిందే. ఈ సారి ఎన్నికల్లో ఓటు వేయడానికి పట్టభద్రులంతా తప్పనిసరిగా కొత్తగా ఓటు నమోదు చేసుకోవాలని ప్రకటించింది. దీంతో నియోజకవర్గ వ్యాప్తంగా అర్హత కలిగిన పట్టభద్రులంతా తమ ఓటును నమోదు చేసుకోవడానికి భారీగా ముందుకొచ్చారు. నెల్లిమర్ల నగరపంచాయతీ, మండలంలో 2162 మంది, పూసపాటిరేగ మండలంలో 1259 మంది, డెంకాడ మండలంలో 1394 మంది, భోగాపురం మండలంలో 712 మంది పట్టభద్రులు ఓటర్లుగా నమోదయ్యారు. నియోజకవర్గ కేంద్రం నెల్లిమర్ల, పూసపాటిరేగ, భోగాపురం మండల కేంద్రాల్లో రెండేసి చొప్పున, భోగాపురం మండల కేంద్రంలో ఒక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

పెరిగారు..

2017లో జరిగిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికలతో పోల్చితే ఈ సారి ఓటర్ల సంఖ్య బాగా పెరిగింది. ఓటు నమోదుకు ఎన్నికల సంఘం పలుమార్లు గడువు పెంచడంతో పట్టభద్రులు అవకాశాన్ని వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో 5527 మంది పట్టభద్రులు ఈసారి తమ ఓటును నమోదు చేసుకున్నారు. మార్చి 13న నిర్వహించే ఎన్నికల కోసం నాలుగు మండలాల్లో మొత్తం ఏడు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశాం.
– కేవీ రమణరాజు, తహసీల్దార్, నెల్లిమర్ల

ఘనంగా ఎల్లమ్మ జాతర


సిరిమానోత్సవానికి పోటెత్తిన భక్తులు

- భక్తి శ్రద్ధలతో సిరిమానోత్సవం...
- తరలివచ్చిన వేలాది మంది భక్తులు

నెల్లిమర్ల రూరల్:

మండలంలోని సతివాడలో ఎల్లమ్మ తల్లి జాతర బుధవారం ఘనంగా జరిగింది. వేకువ జామునుంచే భక్తులు తండోపతండాలుగా తరలివచ్చి పెద్ద ఎల్లమ్మ తల్లి అలాగే పక్కనే ఉన్న చిన్నమ్మ తల్లి ఆలయాల్లో మొక్కులు చెల్లించుకున్నారు. సేకరించిన జోగితో పాటు పసుపు, కుంకుమలు అమ్మవారికి చెల్లించి సంపూర్ణ ఆరోగ్యం సిద్ధించాలని, పాడిపంటలు వృద్ధి చెందాలని కోరుకున్నారు. సాయంత్రం డప్పు వాయిద్యాలతో ఎల్లమ్మ తల్లి చదురు నుంచి గ్రామ పొలిమేర వరకు మూడుసార్లు అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు.

సిరిమానోత్సవాన్ని తిలకించిన భక్తజనం

చుట్టుపక్కల ఉన్న 20 గ్రామాల నుంచి భక్తులు తండోపతండాలుగా తరలివచ్చి ఎల్లమ్మతల్లి సిరిమానోత్సవాన్ని కనులారా తిలకించారు. గ్రామానికి చెందిన సబ్బవరపు అచ్యుతరావు సిరిమాను అధిరోహించారు. డప్పు వాయిద్యాలతో ఎల్లమ్మతల్లి చదురు నుంచి సతివాడ జంక్షన్ వరకు సిరిమాను రథం తిరిగింది. జై ఎల్లమ్మ తల్లి అంటూ భక్తులు సిరిమానుపై పసుపు, కుంకుమ, అరటిపండ్లను విసిరారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నెల్లిమర్ల పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ రేవళ్ల శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు రెడ్డి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి కల్యాణం నేడు

- మూడు రోజుల పాటు వేడుకలు


ఆలయంలో వేంచేసి ఉన్న అలమేలుమంగా పద్మావతి సహిత శ్రీనివాసుడు


కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం

డెంకాడ: చింతలవలస ఐదో ఏపీఎస్పీ బెటాలియన్ వద్ద ఉన్న కల్యాణ వేంకటేశ్వరస్వామి 39వ కల్యాణ మహోత్సవానికి ఆలయ కమిటీ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ నెల 2వ తేదీ నుంచి 4 వరకు స్వామి కల్యాణ మహోత్సవాలు నిర్వహించనున్నారు. గురువారం ఉదయం ప్రత్యేక పూజలు, ఆరు గంటలకు శ్రీనివాస కల్యాణం నిర్వహిస్తారు. అలాగే మూడో తేదీ ఉదయం ప్రత్యేక పూజలు, సాయంత్రం ఏడు గంటలకు ఆలయ ప్రాంగణంలో ఉన్న పుష్కరిణిలో తెప్పోత్సవం జరుగుతుంది. అలాగే 4వ తేదీ మధ్యాహ్నం అన్నసమారాధన ఉంటుందని కమిటీ సభ్యులు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విజయనగరం ఫోర్ట్: పట్టణంలోని కమ్మవీధి ఫీడర్ పరిధిలో మరమ్మతులు చేపడుతున్నందున పలు ప్రాంతాల్లో గురువారం ఉదయం పదిన్నర గంటల నుంచి సాయంత్రం నాలుగు వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఎస్ఈ పి.నాగేశ్వరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్క్‌గేటు, కమ్మవీధి, కోలగట్ల వీధి, గౌడవీధి, గుంటూరు వారి వీధి, కూరెళ్ల వీధి ప్రాంతాలకు సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పలు గ్రామాల్లో..

భోగాపురం: మండలంలోని పోలిపల్లి, లింగాలవలస, చెరుకుపల్లి, మహరాజుపేట, ముక్కాం సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఆయా సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేటి నుంచి సూఫీ సుగంధ మహోత్సవాలు

- ఏర్పాట్లు పూర్తి
- ఎం.డి ఖలీలుల్లా షరీఫ్, ఉత్సవ నిర్వాహకుడు


హజరత్ ఖాదర్ వలీ బాబా

విజయనగరం టౌన్: నగరంలోని బాబామెట్ట వద్ద గల హజరత్‌బాబా దర్గాలో గురువారం నుంచి 64వ సూఫీ సుగంధ మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసినట్లు ఉత్సవ నిర్వాహకుడు ఎం.డి ఖలీలుల్లా షరీఫ్ తెలిపారు. సాటి మనిషి ఆకలి తీర్చడం, వారిని బాధల నుంచి విముక్తి చేయడంలోనే భక్తి ఉందని హజరత్ ఖాదరవలీ బాబా సర్వమానవాళికి ఓ అద్భుతమైన సందేశాన్ని అందించారు. అన్నిదానాల్లో కంటే ఉత్తమమైనది అన్నదానమని, సర్వమతాలు ఒక్కటేనని ఉద్బోధించేవారు. ఖాదర్‌వలీ బాబా ఎంతోమంది రోగులను నయం చేస్తూ, ఆధ్యాత్మిక ప్రవచనాలు చెబుతూ సమాజాన్ని సన్మార్గంలో నడిపారు. 1960లో ఆయన భగవంతునిలో ఐక్యమయ్యారు. అనంతరం ఆయన ప్రధాన శిష్యుడైన సూఫీ మహమ్మద్ అతావుల్లా షరీఫ్ షాతాజీ ఖాదరీబాబా సేవలను కొనసాగిస్తూ 2022 నవంబర్ 19న దైవ సన్నిధికి చేరుకున్నారు. ప్రస్తుతం ఆయన వారసులు దర్గా తరఫున సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా గురువారం ఉరుసుమహోత్సవం, పవిత్ర ఖురాన్ పఠనం, జెండా మహోత్సవం, చాదర్ సమర్పణ ఉంటుంది. మూడో తేదీ ఉదయం ఆరు గంటలకు పవిత్ర ఖురాన్ పఠనం, 10 గంటలకు దర్బార్ షరీఫ్ నుంచి నషాన్, చాదర్, సందల్ షరీఫ్‌లతో ఫకీర్ మేళా ఖవ్వాలీతో ప్రత్యేక వాహనంలో విజయనగర వీధుల్లో మహా ఊరేగింపు.. మార్చి 4న ఖురాన్ షరీఫ్ పఠనం, చాదర్ సమర్పణ, దస్తర్‌బందీ భక్తులకు చాదర్, తబరుక్ (ప్రసాదం) పంపిణీ, ఉరుసు సమాప్తం ఉంటుంది. ఆయా రోజుల్లో బాబా దివ్య సందేశాలు, నిత్యాన్నదానం ఉంటాయని, భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని నిర్వాహకులు కోరారు.

బాల్య వివాహాలకు దూరంగా ఉండండి

విజయనగరం అర్బన్: ప్రతి విద్యార్థి బాల్య వివాహాలకు దూరంగా ఉండాలని సామాజిక, పరివర్తన మార్పు సమాచార వ్యవస్థ (ఎస్బీసీసీ) జిల్లా కోఆర్డినేటర్ బి.రామకృష్ణ అన్నారు. బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దడానికి కలెక్టర్ సూర్యకుమారి ఆదేశాలు, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ సూచనల మేరకు బుధవారం స్థానిక మహారాజా సంస్కృతిక ఉన్నత పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, రక్తహీనత నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు టి.లలితకుమారి, ఉపాధ్యాయులు రామునాయుడు, కె.తవుడుబాబు, తదితర ఉపాధ్యాయులతో పాటు ఏఎన్ఎం వరలక్ష్మి, మహిళా సంరక్షణ కార్యదర్శి త్రివేణి, విద్యార్థులు పాల్గొన్నారు.

పూతికపేటలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం


పట్టభద్రుడికి కరపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నెల్లిమర్ల రూరల్: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ బరిలో వైఎస్సార్‌సీపీ మద్దతుతో నిలిచిన సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా మండలంలోని పూతికపేటలో గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు బుధవారం ప్రచారం నిర్వహించారు. సీతంరాజును గెలిపించాలని కోరుతూ పట్టభద్రులకు కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు లెంక గోవిందరావు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

5,209 మందికి పింఛన్లు


ఆస్పత్రిలో ఉన్న మహిళకు పింఛను అందజేస్తున్న దుప్పాడ గ్రామ వలంటీర్


విజయనగరం రూరల్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ పింఛన్ కానుకను అవ్వాతాతలకు, వితంతువులకు గ్రామ వలంటీర్లు బుధవారం పంపిణీ చేశారు. మండలంలో 5,906 మంది పింఛన్‌దారులుండగా.. మొదటి రోజే 5,209 మంది లబ్ధిదారులకు నగదు అందజేశారు. ఐదు గ్రామాల్లో 90 శాతానికి పైగా పింఛన్లు పంపిణీ చేయగా, మండల వ్యాప్తంగా 88.2 శాతం పింఛన్లు పంపిణీ చేశామని ఎంపీడీఓ గంటా వెంకటరావు తెలిపారు. కొన్ని గ్రామాల్లో వృద్ధులు అనారోగ్యంతో ఆస్పత్రుల్లో ఉన్నా వలంటీర్లు అక్కడకి వెళ్లి మరీ పింఛన్లు అందజేశారన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి


వినోద్ కుమార్ దుబే (ఫైల్)

విజయనగరం: వైఎస్సార్‌సీపీ విజయనగరం పట్టణ నాయకుడు వినోద్‌కుమార్ దుబే మృతి చెందారు. కంటోన్మెంట్ జోనల్ సమన్వయకర్తగా బాధ్యతలు నిర్వహిస్తున్న దుబే కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. విశాఖలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. దుబే మృతి పట్ల ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామితో పాటు విజయనగరం నియోజకవర్గ నాయకులు తమ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

న్యాయవాదుల ధర్నా


ధర్నాలో పాల్గొన్న న్యాయవాదులు

విజయనగరం లీగల్: రంగారెడ్డి జిల్లా న్యాయవాది సుధాకర్ పై జరిగిన భౌతిక దాడులకు నిరసనగా స్థానిక న్యాయవాదులు బుధవారం తమ విధులను బహిష్కరించారు. అనంతరం కోర్టు బయట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం ప్రధాన కార్యదర్శి ఎర్రోతు హరికృష్ణ మాట్లాడుతూ, న్యాయవాదులపై భౌతికదాడులు పాల్పడడం శోచనీయమన్నారు. న్యాయవాదుల రక్షణ చట్టం తక్షణమే రూపొందించాలని డిమాండ్ చేశారు. దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. ధర్నాలో సంఘ ఉపాధ్యక్షుడు చుక్క భాస్కరరావు, యూవీ రాజేష్, భవానీ, కె.అప్పారావునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక సేవలు విస్తృతం చేయాలి


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆర్.సూర్యపాత్రో, తదితరులు

విజయనగరం టౌన్: జిల్లా కేంద్రంలోని పైడిమాంబ కళానికేతన్ ద్వారా ఆధ్యాత్మిక సేవలు విస్తృతం చేయాలని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆర్. సూర్యపాత్రో ఆకాంక్షించారు. సంస్థ 25వ వార్షికోత్సవం వివరాలతో పాటు నూతన కార్యవర్గం ఎంపికను బుధవారం స్థానిక లేడీస్ రిక్రియేషన్ క్లబ్‌లో నిర్వహించారు. ముందుగా పైడితల్లి అమ్మవారి చిత్రపటం వద్ద జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఆధ్యాత్మిక సేవలు మరింత విస్తృతం చేసేందుకుగాను నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేసినట్లు చెప్పారు. ఉపాధ్యక్షులుగా దవళ సర్వేశ్వరరావు, డాక్టర్ జక్కు రామకృష్ణ, కర్రి సత్యనారాయణ, పాకలపాటి బద్రినారాయణరాజు, కార్యదర్శిగా డాక్టర్ ఎస్. అచ్చిరెడ్డి, సహాయ కార్యదర్శులుగా నాగప్రకాష్, రాధికారాణి, కోశాధికారిగా పెద్దింటి అప్పారావు, కార్యవర్గ సభ్యులుగా దేవరాజు గోపాలకృష్ణ, గౌరవాధ్యక్షులుగా నాలుగెస్సుల రాజు, తదితరులను ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో విజయభావన ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎ.గోపాలరావు, కళానికేతన్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

200 మందికి నేత్ర పరీక్షలు


రోగిని పరీక్షిస్తున్న డాక్టర్

పూసపాటిరేగ: మండలంలోని కొత్తకొప్పెర్లలో బుధవారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్యశిబిరంలో సుమారు 200 మంది రోగులకు పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి వైద్యులు మందులు అందజేశారు. కార్యక్రమంలో బయోటెక్ హెచ్ఆర్ ప్రతినిధి మేఘన, సిబ్బంది యెగ్నేష్‌తో పాటు పుష్పగిరి కంటి ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

చురుగ్గా భూముల రీ సర్వే


కంచేరులో రీసర్వేపై సిబ్బందికి సూచలిస్తున్న తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావు

భోగాపురం: భూ సంబంధిత సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల కాలంలో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం ప్రవేశపెట్టారు. దీంతో రెవెన్యూ అధికారులు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. అనంతరం రైతుల సమక్షంలో భూ రీసర్వే చేపట్టి హద్దులు గుర్తిస్తున్నారు. ఇప్పటికే మండలంలోని రెవెన్యూ గ్రామాల్లో రీ సర్వే చురుగ్గా సాగుతోంది. లక్ష్మీపురం, రాజాపులోవ, చెరుకుపల్లి, కంచేరుపాలెం, బసవపాలెం, గుడివాడ, జగ్గయ్యపేట, కంచేరు, కోట భోగాపురం, కొంగవానిపాలెం గ్రామాల్లో రీ సర్వే పూర్తయింది. ఆయా రెవెన్యూ గ్రామాల్లో 7,495 ఎకరాలు ఉండగా, 6 వేల ఎకరాలకు సంబంధించి భూముల రీ సర్వేను పూర్తి చేసి, వాటిలో 1300 ఎకరాల వరకు ప్రభుత్వ భూమి ఉన్నట్లు గుర్తించారు.

సర్వేతో సమస్యలు పరిష్కారం

డీజీపీఎస్, ఈటీఎస్, డ్రోన్ సర్వేల ద్వారా భూముల రీ సర్వే చేపడుతున్నాం. దీనివల్ల రైతు సాగు చేస్తున్న భూమి విస్తీర్ణ వివరాలు కచ్చితంగా తెలుసుకోవచ్చు. రికార్డుల స్వచ్ఛీకరణ, ఆక్రమణలు, వివాదాలు, మిగులు భూముల గురించి కూడా రైతులు తెలుసుకోవచ్చు. – కోరాడ శ్రీనివాసరావు, తహసీల్దార్, భోగాపురం

మధ్యాహ్న భోజనం పరిశీలన


మధ్యాహ్న భోజనాన్ని రుచిచూస్తున్న ఎంపీడీఓ దాసరి బంగారయ్య

భోగాపురం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని ఎంపీడీఓ దాసరి బంగారయ్య మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. మండలంలోని రాయివలస మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఆరోగ్యం, హాజరు, తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి


పేరాపురం గొల్లపేటలో చదును చేసిన ప్రభుత్వ స్థలం

పూసపాటిరేగ: మండలంలోని పేరాపురం పంచాయతీ పరిధి గొల్లపేటలో చోటుచేసుకున్న భూ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామానికి చెందిన కొంతమంది సర్వే 113లో ఆక్రమణలకు పాల్పడ్డారన్నారు. ఎవరైనా అడిగితే 1996లో పట్టాలు ఇచ్చారని బుకాయిస్తున్నారని, వాస్తవానికి వారి వద్ద ఎటువంటి పట్టాలు లేవని పలువురు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ ఇ.భాస్కరరావు వద్ద ప్రస్తావించగా.. ఆక్రమణదారులపై చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.